నగర సుందరీకరణకు భంగం కలిగిస్తే చర్యలు

అధికారులకు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



నగర పర్యటనలో అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర సుందరీకరణకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ప్రకాశం బ్యారేజ్, వన్ టౌన్, ఎంజీ రోడ్, బెంజ్ సర్కిల్, రామవరప్పాడు రింగ్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సుందరీకరణపై ఉద్యానవన, ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్మాణ వ్యర్థాలు, కేబుల్ వైర్లు నగర సుందరీకరణకు భంగం కలిగించేలా కనిపించినా వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రతిరోజు ప్లానింగ్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా లేకుండా చూసుకోవాలని, అధికారులకు ఎప్పటికప్పుడు వాటిపై నివేదికను సమర్పించాలని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచాలని ఎప్పటికప్పుడు రోడ్లను పరిశుభ్రపరుస్తూ, వ్యర్థాలను వెంటనే తొలగించాలని ప్రజారోగ్య సిబ్బందికి తెలిపారు. పగిలిపోయిన ఫుట్‌పాత్‌లు, పాడైపోయిన డివైడర్లు గుంతలు పడిన రోడ్లను ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటూ మరమ్మతులు చేయిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీలో రెవెన్యూపై సమీక్ష

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రతి అసెస్‌మెంట్‌లకు పన్నులు ఉండాలని, ఖాళీస్థలాలు, ఆస్తిపన్నులు, నూతన ఇళ్లు, భవనాలు తదితర వాటిపై పన్నులు విధించాలని వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ)జి.సృజన అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న మీటింగ్ హాల్లో గురువారం ఆమె రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో జరుగుతున్న సర్వే స్థితిగతులను సమీక్షించారు. ఈ సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా లేదా వాటిలో ఇల్లు నిర్మించారా, ఒకవేళ ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుగా మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఉందా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. భవనాలకు అదనపు గదులు, ఫ్లోర్లు నిర్మించిన, ఆ మార్పుకు తగిన విధంగా పన్నును ఈ సర్వే ద్వారా మార్చాలని ఆదేశించారు. వార్డు అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కచ్చితంగా ఈ సర్వేను పూర్తి చేయాలని, నగరవాసులు కూడా వీఎంసీ సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, బి.శ్రీనివాసరావు, ఏయూబీ శర్మ, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన

క్లుప్తంగా

పీఎన్‌బీఎస్‌లో అదనంగా మరో 119 కుర్చీలు ఏర్పాటు



బస్టాండ్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల సౌకర్యార్థం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో అదనంగా 119 మూడు సీట్ల కుర్చీలు ఏర్పాటు చేసినట్లు పీఎన్‌బీఎస్ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. ప్రతి రోజు 1.40 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండే సమయంలో ఇబ్బంది పడకుండా ప్రస్తుతం ఉన్న 187 మూడు సీట్ల కుర్చీలతో పాటుగా కొత్తగా 119 మూడు సీట్ల కుర్చీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం కోసం వాటిని డిపార్చర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దుర్గమ్మకు వెండి పట్టీలు సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు గురువారం వెండి పట్టీలను సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్.శశికళ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసి పట్టుచీర, సుమారు రూ.30 వేల విలువైన 285 గ్రాముల వెండితో తయారుచేసిన పట్టీలను ఆలయ ఈవో శీనానాయక్‌కు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలు ఆలయ ఈవో శీనానాయక్ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

కళాకారులు కులమతాలకు అతీతులు



విజయవాడకల్చరల్: కళాకారులు కులమతాలకు అతీతులని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సమితి, సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఎస్వీ రంగారావు 107వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నవరస నటుడు ఎస్వీఆర్ అని అభివర్ణించారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ ఎస్వీఆర్ ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలడని కొనియాడారు. ఆయన నటించిన నర్తనశాల చిత్రం అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించినట్లు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన అల్లూరి మార్కండేయ రాజు, హరగోపాల్ పాల్గొన్నారు. అతిథులు ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.

మద్యం తాగి వాహనం నడుపుతున్న 25 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 25 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలో రెండు, నాల్గవ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 25 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిని ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు హాజరు పరిచారు. వారిలో ఐదుగురికి ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున రూ.75 వేలు, మరో 20 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.2 లక్షలు, అందరికీ కలిసి రూ.2.75 లక్షలు జరిమానా విధించారు. ప్రతిరోజూ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, పట్టుబడిన వారికి జరిమానాలు విధిస్తామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

రేపు భువన విజయం గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు రచించిన భువన విజయం కథలు గాథలు గ్రంథావిష్కరణ కార్యక్రమం 5 వ తేదీ శనివారం సాయంత్రం హోటల్ ఐలాపురంలో నిర్వహిస్తునట్లు కృరసం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాన్ని ఏపీ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్ ఆవిష్కరిస్తారని చెప్పారు. రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, సమాచార హక్కు పూర్వపు కమిషనర్ ఐలాపురం రాజా పాల్గొంటారని తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలి

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గోదావరి గంగ



టీబీ అవగాహన పోస్టర్ ఆవిష్కరణలో కార్పొరేటర్ గోదావరి గంగ, ఆరోగ్య సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజంలో క్షయ వ్యాధిగ్రస్తులను ముందుగా గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే వ్యాధిని అరికట్టవచ్చని వైఎస్సార్ సీపీ 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. డివిజన్ పరిధిలోని లంబాడీపేట యూపీహెచ్‌సీలో కొత్తపేట టీబీ ఆరోగ్య సిబ్బంది గురువారం అవగాహన, ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపైన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, అలసిపోవడం, చెమటలు పట్టడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలని వివరించారు. వాటిలో ఏ ఒక్క లక్షణం కనిపించినా వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో కళ్లె పరీక్ష, చెస్ట్ ఎక్సరే చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి నెలా రూ.1000 పోషణ భత్యం లభిస్తుందని చెప్పారు. 60 సంవత్సరాలు దాటి షుగర్ మందులు వాడేవారికి భవిష్యత్‌లో టీబీ రాకుండా సీవై–టీబీ స్కిన్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో గోదావరి బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధ, టీబీ యూనిట్ ఆరోగ్య సిబ్బంది ఫ్రాన్సిస్, జోసఫ్ తంబి, రమీజ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.

దుర్గగుడి క్లోక్‌రూమ్‌లో బ్యాగ్ చోరీపై ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (దుర్గగుడి) క్లోక్ రూమ్‌లో నకిలీ టోకెన్ ఇచ్చి బ్యాగ్ ఎత్తుకుపోయిన వ్యక్తిపై వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుర్గగుడి ప్రాంగణంలో ఉన్న క్లోక్ రూమ్‌లో జూన్ 30వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఓ వ్యక్తి వచ్చి లెనోవో లోగో కలిగిన బ్యాగ్‌ను ఉంచి టోకెన్ తీసుకుని వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత వేరే వ్యక్తి వచ్చి టోకెన్ ఇచ్చి ఆ బ్యాగ్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 2.30 గంటలకు బ్యాగ్ పెట్టిన అసలు వ్యక్తి టోకెన్ తెచ్చి తన వస్తువు ఇవ్వాలని కోరగా బ్యాగ్ కనపడలేదు. దాంతో లోపల వెతకగా ముందు ఇచ్చిన టోకెన్ నకిలీదిగా గుర్తించారు. అందులో సెల్‌ఫోన్, సుమారు ఐదు వేల నగదు, పవర్‌బ్యాంక్, ఇన్సూరెన్స్ పత్రాలు ఉన్నట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. దీనిపై క్లోక్‌రూమ్ ఉద్యోగి జి.నాగేశ్వరరావు వన్‌టౌన్ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ స్ట్రీట్‌లో స్టాళ్ల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): వీధి విక్రయదారుల జీవనోపాధిని మెరుగుపరచేందుకు, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్ఎల్‌యూఎం)2.0 ద్వారా నగరంలోని భవానీపురంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్‌లో వీధి విక్రయాలు జరుపుకొనేందుకు విక్రయదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో స్మార్ట్ స్ట్రీట్‌ను భవానీపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు ఇటీవల టౌన్‌వెండింగ్ కమిటీ(టీవీసీ) కూడా 40 స్టాల్స్ ఏర్పాటు చేయటానికి తీర్మానించిందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ లోపు నగరంలోని ఆసక్తి కలిగిన వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. అభ్యర్థులకు 16–17వ తేదీల్లో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ(అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్), టీవీసీ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు 18 ఏళ్లు నిండాలని, దరఖాస్తుదారులు తప్పనిసరిగా వీధి వ్యాపారాలు చేయాలని, వారి పేర్లు కూడా వీఎంసీలో వీధి విక్రయదారులుగా నమోదు కావాలని, అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్కు, మూడు ఫొటోలతో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

21న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చలో విజయవాడ

ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామలింగారెడ్డి తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21న రామవరప్పాడు రింగ్ నుంచి విద్యుత్ సౌధ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారి యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు తెలంగాణ రాష్ట్రంలో తరహాలో నేరుగా జీతాలు చెల్లించాలని, నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీ విద్యుత్ ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం, ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్న విద్యుత్తు కార్మిక సంఘాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈనెల 8 నుంచి 21వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తామన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే మల్లికార్జునరెడ్డి, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి తదితరులు పాల్గొన్నారు.

10న శాకంబరీదేవి ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో 10వ తేదీన శాకంబరీదేవి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యం, పవన్‌కుమార్ శర్మ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవాల వివరాలను ప్రకటించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి శాకంబరీదేవి ఉత్సవాలు, ఆషాఢ సారె సమర్పణ జరుగుతుందన్నారు. ఈనెల 6వ తేదీ శ్రీగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో గాజుల విజయలక్ష్మీ బృందంచే అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 10వ తేదీ అమ్మవారితో పాటు స్వామి వారిని, ఉపాలయాల్లో కొలువై ఉన్న దేవతా మూర్తులను కాయగూరలు, ఆకుకూరలతో అలంకరిస్తారన్నారు.

శ్రవ్య నాటక సవ్యసాచి రామ్మోహన్‌రావు



సి.రామమోహన్‌రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హరగోపాల్, పీవీఎల్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రంగస్థల, సినీ నటుడు, నాటక రచయిత – దర్శకుడు – ప్రయోక్త, ఆకాశవాణి విజయవాడ కేంద్రం విశ్రాంత సీనియర్ అనౌన్సర్, శ్రవ్య నాటక సవ్యసాచి చివుకుల రామ్మోహన్‌రావు చిరస్మరణీయుడని పలువురు కళాకారులు, కళాసంస్థల ప్రతినిధులు అన్నారు. సి.రామమోహన్‌రావు జయంతి సందర్భంగా పీవీఎల్ నృసింహం బృందం, కళామంజరి సాంస్కృతిక సంస్థ, శ్రీవిజయదుర్గా నాట్యమండలి, సి.రామమోహన్‌రావు కల్చరల్ అసోసియేషన్, చివుకుల కుటుంబసభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గుణదలలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో స్టాఫ్ ఆర్టిస్ట్‌గా, అనౌన్సర్‌గా విధులు నిర్వర్తిస్తూనే రేడియో కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన రామమోహన్‌రావు చిరస్మరణీయుడని కొనియాడారు. ఎంతోమంది కళాకారులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసి వారికి మెరుగైన శిక్షణ ఇచ్చి రేడియో నాటకానికి, రంగస్థల నాటకానికి ఉన్న వ్యత్యాసాన్ని చూపించారని గుర్తు చేశారు. డైలాగ్ మాడ్యులేషన్‌లో రేడియో, రంగస్థల కళాకారులకు శిక్షణ ఇచ్చి 'కింగ్ ఆఫ్ డైలాగ్'గా ఖ్యాతి గడించారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రేడియో, నాటక ప్రదర్శనలకు అనేక అవార్డులు పొందటమే కాకుండా ఆనందభైరవి, నెలవంక, నిప్పులాంటి మనిషి, సీతారామ కల్యాణం తదితర చిత్రాలలో నటించారన్నారు. తొలుత రామమోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి రేడియో, రంగస్థల నాటక రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

జర్రున జారి...గాయాల పాలై...

- నిత్యం పది మందికి పైగా వాహనదారులు ఆస్పత్రుల పాలు
- పట్టించుకోని అధికారులు



కింద పడిపోయిన ద్విచక్రవాహనదారులు



రోడ్డుమీదనే వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తున్న దృశ్యం

ఆటోనగర్(విజయవాడతూర్పు): గంటతిప్ప డ్రైన్ వద్ద ఉన్న నగరపాలకసంస్థ డంపింగ్ యార్డు వాహనదారులకు తలనొప్పిగా మారింది. నగరంలోని వ్యర్థాలన్నింటిని ఇక్కడ వేస్తున్నారు. ఈ క్రమంలో చెత్తాచెదారాలు రోడ్డు మీద పడటం వల్ల అటుగా నిత్యం రాకపోకలు సాగించేవారి వాహనాలు జారి కింద పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఈ విషయంలో నగరపాలకసంస్థ అధికారులు గాని, ఐలా అధికారులు గాని పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనికి తోడు తరచుగా వర్షం కురుస్తుండటం వల్ల వాహనాలు స్కిడ్ అవుతున్నాయి.

రోడ్డు మీదనే రీసైక్లింగ్...

రోడ్డుమీదనే క్రేన్‌తో వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తున్నారు. దీని వల్ల రోడ్డు మీద ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడిపోతున్నాయి. దీనికి తోడు చెత్త వాహనాల్లో ఇక్కడకు తీసుకువచ్చే వ్యర్థాలు, కుళ్లిపోయిన కూరగాయలు వంటివి రోడ్డుమీద పడుతున్నాయి. వీటి వల్ల రోడ్డు మీద వెళ్లే వాహన చోదకులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఒక్క గురువారం రోజే 15 మందికి పైగా కింద పడి గాయాల పాలయ్యారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. శానిటేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా ఫలితంలేదు

నిత్యం పది మందికి పైగా జారి కిందపడి గాయాల పాలవుతున్నారు. డంపింగ్ యార్డు ను వేరే చోటికి మార్చాలి. గత కొన్ని దఫాలుగా ఐలా, నగర పాలక సంస్థ అధికారులకు విన్నవించాం. ఫలితం లేదు.

–అబ్దుల్ కలాం, ద్విచక్ర వాహనదారుడు

ఎమ్మెల్యే ఆదేశాల మేరకే అక్రమ కేసులు

సీపీఎం నేత పీవీ ఆంజనేయులు ధ్వజం

మైలవరం: రోడ్లను బాగుచేయమనడం నేరమా ఎమ్మెల్యే గారూ అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని అడిగినందుకే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీపీఎం నాయకుడిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షం ఉండకూడదనే ఉద్దేశంతోనే స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్‌పై కేసులు బనాయించారన్నారు. మైలవరం నుంచి నూజివీడు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పూర్తిగా దెబ్బతిని ఏడాది కావస్తోందని, ఈ క్రమంలో ప్రభుత్వం రోడ్డు వేస్తామని చెప్పి జేసీబీతో పూర్తిగా తొలగించి ఐదు నెలలుగా అలాగే వదిలి వేసిందన్నారు. ప్రజల అవస్థలు గమనించిన సీపీఎం మైలవరం మండల కమిటీ వెల్వడం, గణపవరం, చంద్రాల గ్రామస్తులతో కలిసి రెండుసార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. అయినా అధికారులు స్పందించలేదని, ఈ నేపథ్యంలోనే గత మంగళవారం గణపవరం అడ్డరోడ్డు వద్ద మరోసారి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీస్ అధికారులు దురుసుగా ప్రవర్తిస్తూ సీపీఎం మండల కార్యదర్శి సుధాకర్‌ను అరెస్టు చేసి బైండోవర్ కేసు బనాయించారన్నారు.







డ్రగ్స్‌పై ఈగల్ ఉక్కుపాదం


నగరంలో డ్రగ్స్, గంజాయి రవాణాపై ఈగల్ ఉక్కుపాదం మోపింది. ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ గురువారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఆయన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ చేస్తుండగా బిహార్‌కు చెందిన ఒక వ్యక్తి వద్ద గంజాయి చాక్లెట్లను గుర్తించి సీజ్ చేశారు. కార్యక్రమంలో డీసీపీ సరిత, రైల్వే సీనియర్ డీఎస్‌సీ షణ్ముగ వడివేల్, జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు, సీఐలు జి.వి రమణ, దుర్గారావు, ఆర్‌పీఎఫ్ సీఐ ఫతే ఆలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

– రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ)

మహిళా ఉద్యోగిపై దాడి.. కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సచివాలయ మహిళ ఉద్యోగిపై దాడి చేసిన తండ్రి కొడుకులపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వేలో భాగంగా ఇంటి కొలతలు తీసుకుంటున్న గవర్నర్‌పేట 23వ డివిజన్ 98వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ అర్చనపై భవన యజమానికి కంతేటి నాగ వెంకట రంగనాయకులు, ఆయన కుమారుడు కంతేటి యతిరాజ్ నిక్షిత్ దాడి చేసిన విషయం తెలిసిందే. దీనిపై అడ్మిన్ సెక్రటరీ అర్చన బుధవారం రాత్రి గవర్నర్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాయనపాడులో రైల్వే ఫ్లై ఓవర్ పరిశీలన



రాయనపాడు(విజయవాడ రూరల్): రాయనపాడు గ్రామంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ గురువారం జరిగింది. రాయనపాడు గ్రామంలో శాంతినగర్ నుంచి చెరువు అవతలి వైపునకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించే విధంగా అధికారులు ఒక ప్రైవేటు సంస్థ ద్వారా ఎలైన్‌మెంట్ తయారు చేయించారు. పాత ఎలైన్‌మెంట్‌లో వ్యవసాయ శాఖకు చెందిన రైతు సేవా కేంద్రం తొలగించే అవకాశం ఉంది. రైతు సేవా కేంద్రం యథావిధిగా ఉండేలా మార్పు చేసి ఎలైన్‌మెంట్ తయారుచేసే విధంగా అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అధికారుల సూచనలను గ్రామస్తులు సున్నితంగా వ్యతిరేకించి పాత ఎలైన్‌మెంటు ప్రకారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారులు, గ్రామస్తుల అభిప్రాయాలకు స్వల్ప తేడాలు ఉండటంతో అధికారులు ఆయా ప్రాంతాల పరిశీలనతో వెనక్కి వెళ్లారు. రైల్వే, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.